# అధిక లాభాలు.. వ్యాపారం పేరిట మోసం

- వెయ్యి కోట్లకు పైగానే చీటింగ్ జరిగినట్లు అంచనా
- మోసగాళ్లను తప్పించేందుకు సినీ నిర్మాత ప్రయత్నం
- అధిక లాభాల పేరుతో మోసం చేసిన కేసులో సీసీఎస్ పోలీసుల లోతైన దర్యాప్తు

సిటీబ్యూరో, నవంబర్ 3(నమస్తే తెలంగాణ): అధిక లాభాల పేరుతో రెండు తెలుగు రాష్ట్రాలలో వందలాది మంది నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసిన కేసులో ఒక సినీ నిర్మాత పాత్ర కూడా కీలకంగా ఉందని సీసీఎస్ పోలీసులు భావిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లాకు చెందిన గుదే రాంబాబు, పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన పెన్మత్స కృష్ణంరాజులు 200 మందిని రూ.530 కోట్లు మోసం చేయగా, ఈ కేసులో ఇటీవల వారిని సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. రాధారామ్ మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో సంస్థను ప్రారంభించి మొదట్లో విజయవాడలో చాక్లెట్ల డిస్ట్రిబ్యూషన్, అందులో లాభాలు రావడంతో వ్యాపారాన్ని మరింతగా విస్తరించి పలువురి నుంచి మొదట ఆర్థిక సహకారం తీసుకున్నారు. ఆ తరువాత ఫస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్‌ను విక్రయిస్తూ, ఆ వ్యాపారాన్ని పెద్దది చేశారు. ఇందుకు తెలిసిన వారు, బంధువులు, స్నేహితుల నుంచి భారీ ఎత్తున పెట్టుబడులు సేకరించారు. 6 నుంచి 13 శాతం పెట్టుబడిపై ప్రతి నెల లాభాల ఇస్తామంటూ నమ్మించి, మొదట అందరికి మాట ప్రకారం చెల్లింపులు చేశారు. అందరికి నమ్మకం కుదరడంతో అసలు వ్యాపారాన్ని వదిలేసి, కేవలం పెట్టుబడులు వసూలు చేసి, వచ్చిన దాంట్లో పాత వారికి లాభాల పేరిట చెల్లింపులు చేస్తూ మల్టీ లెవల్ వ్యాపారాన్ని నిర్వహించారు. ఇలా 200 మంది నుంచి రూ.530 కోట్లు వసూలు చేసి, టర్నోవర్ చేసి మోసం చేయడంతో బాధితులు సీసీ



ఎస్‌లో ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో నిందితులిద్దరిని అరెస్ట్ చేశారు. అరెస్ట్ విషయం తెలియగానే మరింత మంది బాధితులు సీసీఎస్ పోలీసులను ఆశ్రయిస్తున్నారు. వీళ్ల మోసాలు వెయ్యి కోట్లకు పైగానే ఉండే అవకాశాలున్నాయని పోలీసులు భావిస్తున్నారు. కాగా, విచారణలో సినీ నిర్మాత అట్లూరి నారాయణ రావు పాత్ర ఉన్నట్లు బయటపడటంతో ఈ కేసులో అతడిని కూడా నిందితుడిగా చేర్చారు. ఇప్పటికే అరెస్టైయిన ప్రధాన నిందితులను కస్టడీలోకి తీసుకొని విచారించేందుకు సీసీఎస్ పోలీసులు సిద్ధమవుతున్నారు.

## దేవాదాయ శాఖ భూమిని అమ్మేందుకు సినీ నిర్మాత కుట్ర

### సీసీఎస్‌లో 2018లో కేసు నమోదు

అధిక లాభాల పేరుతో రెండు తెలుగు రాష్ట్రాలలో వందలాది మంది నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసిన చేసిన కేసులో సినీ నిర్మాత అట్లూరి నారాయణరావు పాత్ర కూడా కీలకంగా ఉందని సీసీఎస్ పోలీసులు భావిస్తున్నారు. ఇతనిపై సీసీఎస్‌లో 2018లోను ఒక కేసు నమోదైనట్లు వెలుగులోకి వచ్చింది. బంజారాహిల్స్‌లోని ఆదిత్య హిల్‌టాప్ అపార్టుమెంట్స్‌లో నివసించే అట్లూరి నారాయణరావు, దేవాదాయ శాఖకు చెందిన స్థలాన్ని చూపించి, బంజారాహిల్స్‌కు చెందిన వ్యాపారి నుంచి రూ.1.65 కోట్లు కాజేశాడనే అభియోగాలపై కేసు నమోదయ్యింది. అధిక లాభాలు గడించాలనే కేసే కాకుండా.. నారాయణరావు గతంపై ఆరా తీయగా సీసీఎస్‌లో 2018లో నమోదైన కేసు వ్యవహారం వెలుగులోకి వచ్చింది. శేరి లింగంపల్లిలోని తారానగర్‌లో దేవాదాయ ధర్మాదాయ శాఖకు 3 ఎకరాల భూమికి నకిలీ పత్రాలు సృష్టించి ఒక పథకం ప్రకారం, ఖైరతాబాద్‌లోని ఎస్ఎంహెచ్ హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్వాహకుడైన మహమూద్ హుస్సేన్‌ను రూ. 1.65 కోట్లకు మోసం చేశాడు. ఈ విషయంపై సీసీఎస్‌లో హుస్సేన్ కేసు నమోదు చేశాడు. నారాయణరావు గురించి ఆరా తీయడంతో గతంలో నమోదైన కేసులు ఒక్కొక్కటి బయటకు వస్తున్నాయి.

## దమ్మాయిగూడలో డ్రగ్స్ పట్టివేత



పట్టుబడిన ఓపీఎం డ్రగ్స్‌తో నిందితులతో ఇన్‌స్పెక్టర్, సిబ్బంది

జవహర్‌నగర్, నవంబర్ 3: వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతున్న స్కూటీని పట్టుకుని తనిఖీ చేయగా 50 గ్రాముల డ్రగ్స్ లభ్యమయ్యాయి. ఈ ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీతారాం తెలిపిన ప్రకారం, కుమావత్ చిల్లారం, మోహన్‌లాల్ చౌదరి బాలాజీనగర్‌లో వ్యాపారం చేస్తూ జీవనం సాగించేవారు. సులభంగా డబ్బులు సంపాదించటానికి అలవాటు పడుతూ రాజస్థాన్ నుంచి తక్కువ ధరకు డ్రగ్స్ తీసుకువచ్చి తెలంగాణలో అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేస్తుండగా, నిందితులు పట్టుబడ్డారు. 50 గ్రాముల ఓపీఎం డ్రగ్స్, రెండు సెల్‌ఫోన్లు, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

### నగర పోలీసు అధికారుల హెచ్చరిక

సిటీబ్యూరో, నవంబర్ 3(నమస్తే తెలంగాణ): నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం నుంచి షురూ కావడంతో బందోబస్తుపై నగర పోలీసులు స్పెషల్ ఫోకస్ చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరిస్తున్నారు. మలక్‌పేట్‌లో ఎంఐఎం, కాంగ్రెస్ మధ్య శుక్రవారం చోటు చేసుకుంటున్న ఘర్షణ వాతావారణంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ప్రశాంతమైన వాతావారణంలో ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా నగర పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు. సమస్యాత్మకమని భావిస్తున్న ప్రాంతాలలో ఎక్కువ సిబ్బంది ఉండటంతో పాటు నిఘాను కూడా పెంచారు. ఎన్నికల ప్రచారం జోరందుకోవడంతో ఎన్నికల వేడి రోజు రోజుకు పెరుగుతుంది. ప్రచారం ఊపందుకునే క్రమంలో పరిస్థితులు కొన్ని సందర్భాలలో ఉద్రిక్తతలకు దారి తీస్తున్నాయి. తెలంగాణ వచ్చిన తరువాత హైదరాబాద్‌లో పండుగలు, ఎన్నికల సందర్భాలలోను ఎలాంటి చిన్న గొడవకు కూడా తావు లేకుండా పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. ప్రశాంత వాతావారణానికి భంగం కలగకుండా ఉండేలా పోలీసులు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. సమస్యాత్మకమైన అభ్యర్థులు, ఆయా పార్టీల ప్రచారాలపై మరింత నిఘాను పెంచుతున్నారు. ఇదిలాఉండగా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి శాంతి భద్రతలకు ఎవరైనా భంగం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సౌత్ ఈస్ట్ జోన్ ఎవరు భంగం కలిగించినా రణాన్ని చెడగొట్టి, ఉద్రిక్తతలను సృష్టించడం, ఘర్షణలకు దిగి నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరిస్తూ కేసులు నమోదు చేస్తామని సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ బృందరాజ్ రోహిత్ రాజ్ తెలిపారు.

## 68 కల్లు దుకాణాలపై సోదాలు

### నమూనాలు సేకరించిన పోలీసులు

సిటీబ్యూరో, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని 68 కల్లు దుకాణాలపై తెలంగాణ స్టేట్ యాంటీ నార్కొటిక్ బ్యూరో(టీనాబ్), స్థానిక పోలీసులతో కలిసి దాడులు చేసింది. కల్లులో అల్ఫాజోలం కలుపుతూ, నిమ్మ ఉప్పు, మినప్పిండితో కృతిమ కల్లు తయారీ చేస్తున్నట్లు సమాచారం రావడంతో గురువారం కల్లు కంపౌండ్‌లలో సోదాలు నిర్వహించారు. ఆయా కంపౌండ్ల నుంచి కల్లు శాంపిల్స్ సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. పరీక్షల అనంతరం, ఆయా కల్తీలపై టీ నాబ్ చర్యలు తీసుకోనుంది. టీ నాబ్ ఎస్పీలు సునీతారెడ్డి, చక్రవర్తి గుమ్మి నేతృత్వంలోని బృందాలు ఈ దాడులు నిర్వహించాయి.

## కల్తీ కల్లు తయారీ కేంద్రంపై.. యూసుఫ్‌గూడ పోలీసుల దాడి

### ప్రమాదకరమైన కెమికల్స్ సీజ్, కేసు నమోదు

వెంగళరావునగర్, నవంబర్ 3: అది కల్తీ కల్లు తయారీ కర్మాగారం. కల్లు కాదది.. గుట్టుగా సాగుతున్న కల్తీ కల్లు తయారీ దందా. కల్తీ కల్లు తయారీ కర్మాగారంపై దాడులు నిర్వహించి పోలీసులు గుట్టు రట్టు చేశాతదరు. యూసుఫ్‌గూడ కల్లు కాంపౌండ్‌లో ఆరోగ్యానికి అత్యంత హాని చేసే కెమికల్స్‌తో కల్లును తయారు చేస్తున్నట్లు పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం. ఈ మేరకు నార్కొటిక్స్ పోలీసులు, మధురానగర్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలోని యూసుఫ్‌గూడ వార్డు కార్యాలయం వెనుకనున్న కల్లు కాంపౌండ్‌లో గుట్టుగా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడేలా కల్తీ కల్లు తయారీ కొనసాగుతుంది. కల్లు కాంపౌండ్ యజమాని అశోక్ గౌడ్(60), కల్లు కాంపౌండ్ మేనేజర్ యాదయ్య గౌడ్ కలిసి కల్లు కంపౌండ్‌లో కల్తీ కల్లును తయారు చేస్తున్నారు. జోగిపేట నుంచి ఒరిజనల్ ఈత కల్లును, సంగారెడ్డి, కడ్తాల్ ప్రాంతాల నుంచి తాటికల్లును తెచ్చి ఇక్కడి కాంపౌండ్‌లో సోడియం కార్బొనైట్, షాక్రీన్, ఖట్టా, చక్కెరలను పెద్ద పెద్ద డ్రమ్ముల్లో కలిపి కల్తీ కల్లును తయారు చేస్తున్నారు. 700 ఎం.ఎల్. కల్తీ కల్లును ఒక్కో సీసాలో నింపి రూ.50లకు విక్రయిస్తున్నట్లు పోలీసు విచారణలో మేనేజర్ యాదయ్య గౌడ్ అంగీకరించాడు. కల్లు కాంపౌండ్ నుంచి 50 కిలోల సోడియం బై కార్బొనైట్ టెక్నికల్ గ్రేడ్ టాటా కెమికల్ పౌడర్ బస్తా, 25 కిలోల వైట్ పౌడర్ బస్తా, 2 కిలోల షాక్రీన్ బ్యాగ్, 5 కిలోల ఖట్టా బ్యాగు, 650 కిలోల చక్కెర బరువున్న మూడు బస్తాలు, 200 లీటర్ల ఈత కల్లు, 200 లీటర్ల తాటి కల్లు, 50 లీటర్ల కల్తీ కల్లు, గుర్తు తెలియని 200 ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటిని పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపామని ఈ మేరకు కేసు కల్లు కాంపౌండ్ యజమాని అశోక్ గౌడ్, మేనేజర్ యాదయ్య పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయినాథ్ రెడ్డి తెలిపారు.

## చెన్నాపూర్‌లో రూ. 2.19 లక్షలు పట్టివేత

జవహర్‌నగర్, నవంబర్ 3: పోలీసుల తనిఖీలో భాగంగా చెన్నాపూర్‌లో రూ.2.19 లక్షలు పట్టుబడ్డాయి. ఈ ఘటన జవహర్‌నగర్ పోలీస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీతారాం తెలిపిన ప్రకారం, చెన్నాపూర్‌లో పోలీసులు తనిఖీ చేస్తుండగా ఎలాంటి పత్రాలు లేకుండా ఓమర్ షరీఫ్, నాగులు రూ.2.19 లక్షలు తీసుకెళ్తుండగా పట్టుకున్నారు. డబ్బులకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో నగదును సీజ్ చేసినట్లు సీఐ సీతారాం తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## కానిస్టేబుల్ ఫోన్ లాక్కొని ఉడాయించిన దొంగలు

వెంగళరావునగర్, నవంబర్ 3: దొంగలు ఏకంగా కానిస్టేబుల్ సెల్ ఫోన్‌ను లాక్కొని ఉడాయించిన ఘటన మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలోని అమీర్‌పేట్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం, ఏపీ మంగళగిరి 6వ బెటాలియన్ కానిస్టేబుల్ చక్రో దొర హైదరాబాద్‌లో నివాసం ఉండే డీజీపీ సునీల్ కుమార్ ఐపీఎస్ వద్ద విధులు నిర్వహిస్తుంటారు. ఈనెల 31వ తేదీ రాత్రి విజయవాడ నుంచి బయల్దేరి 1వ తేది తెల్లవారుజామున నాలుగున్నర సమయంలో అమీర్‌పేట్ మైత్రివనం వద్ద బస్సు దిగారు. డీజీపీ సునీల్ కుమార్ వద్ద పనిచేసే డ్రైవర్‌కు ఫోన్ చేసి పికప్ చేసుకోవాలని కోరాడు. కారు డ్రైవర్ కోసం వేచి చూస్తూ చక్రో దొర నిలబడి ఉండగా, బైక్ పై ఇద్దరు ఆగంతకులు వచ్చారు. కానిస్టేబుల్ చక్రో దొర వద్దనున్న ఫోన్‌ను లాక్కొని వేగంగా బైక్‌పై ఉడాయించారు. కానిస్టేబుల్ తన ఫోన్ స్నాచింగ్‌పై మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రాయల్ ఎయిర్ ఫోర్స్ జెట్లకు ఆర్‌జీఐ ఆతిథ్యం

### ఇండియా-యూకే స్నేహపూర్వక సంబంధం మరింత పటిష్టం

సిటీబ్యూరో, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ) :యునైటెడ్ కింగ్‌డమ్ – భారత్ మధ్య పెరుగుతున్న సహకారానికి, సద్భావనకు సంకేతంగా ఈ ఏడాది మరోసారి రాయల్ ఎయిర్ ఫోర్స్ జెట్లకు రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు(ఆర్‌జీఐఏ)ఆతిథ్యం ఇచ్చింది. శుక్రవారం శంషాబాద్‌లోని ఆర్‌జీఐకి ఆర్ఏఎఫ్ విమానం రీ ఫ్యూయలింగ్ కోసం ల్యాండ్ అయ్యింది. ఈ ఏడాది ఆర్‌జీఐఏకు రావడం రెండోసారి. 'యూకే–ఇండియా ఎయిర్ ఫోర్సెస్ అండ్ సివిల్ ఏవియేషన్ మధ్య ఈ సహకారం రెండు దేశాలను మరింత దగ్గర చేస్తుంది' అని తెలంగాణ–ఏపీ బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్ ట్వీట్ చేశారు. రాయల్ ఎయిర్ ఫోర్స్ యునైటెడ్ కింగ్‌డమ్ సాయుధ దళాల వైమానిక యుద్ధ విభాగానికి చెందినది. దీనిని మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో ఏప్రిల్ 1918లో స్థాపించారు. ప్రపంచంలోనే అత్యంత సాంకేతికంగా అభివృద్ధి చెందిన సామర్థ్యం గల వైమానిక దళాలలో ఒకటిగా పేరుగాంచింది. రక్షణ వ్యవస్థలో యూకే గగనతలాన్ని పర్యవేక్షిస్తూ సైనిక బలగాలకు మద్దతును అందిస్తూ.. అంతర్జాతీయంగా మానవతా, పోరాట కార్యకలాపాల్లో కీలకపాత్రను పోషిస్తున్నది.

## అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిల్స్‌ను చూపిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

హయత్‌నగర్, నవంబర్ 3: అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను పట్టుకున్న ఘటన హయత్‌నగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. ఈ మేరకు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ టి.లక్ష్మణ్ గౌడ్ తెలిపిన ప్రకారం, సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తారమతిపేట, గౌరెల్లిల వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా, రూ.26,280ల విలువైన మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఎక్కడైనా మద్యం నిలువలు కనిపించినా ప్రజలు ఎక్సైజ్ పోలీసులకు సమాచారం అందించాలన్నారు. టోల్ ఫ్రీ నెం.1800 425 2523లలో ఫిర్యాదులు చేయొచ్చని సూచించారు. అక్రమంగా మద్యాన్ని విక్రయించినా, మద్యం నిలువలు కలిగి ఉన్నా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ హనుమంతు, సిబ్బంది పాల్గొన్నారు.

## వాహన తనిఖీల్లో రూ.9.5 లక్షలు స్వాధీనం

బంజారాహిల్స్, నవంబర్ 3: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికల సందర్భంగా అక్రమంగా మద్యం, నగదు తరలింపులను అడ్డుకునేందుకు అధికార యంత్రాంగం రోజూ ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నారు. బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు, బంజారాహిల్స్ పోలీసులు శుక్రవారం తనిఖీలు నిర్వహిస్తుండగా, గ్రీన్ బంజారా కాలనీకి చెందిన ఇంటీరియర్ డిజైనర్ కార్తీక్ రెడ్డి తన తండ్రి కేఎస్ రెడ్డితో కలిసి కారులో వచ్చారు. వాహనంలో రూ.9.50 లక్షల నగదును రవాణా చేస్తున్నట్టు గుర్తించారు. కాగా, నగదును సీజ్ చేసి పోలీసులు స్టేషన్‌కు తరలించారు.